# ఏడవ వేతనసంఘ సిఫార్సులు - మరిన్ని హక్కుల కుదింపుకు బీజాలు

**ప్రతి** పది సంవత్సరాలకొకసారి కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగుల వేతన పెంపుదల కోసం వేతన సంఘాన్ని నియమిస్తూ వస్తోంది. 1946 నుండి 2006 వరకు 6 వేతన సంఘాలను నియమించడం, అవి చేసిన సిఫార్సులను కొన్ని మినహా అటుయిటుగా అమలు చేయడం జరిగింది. అయితే వేతనసంఘాల సిఫార్సులను కేంద్ర పాలకులు దయతలచి అమలుచేయలేదు. గత ఆరుదశాబ్దాలలో ఉద్యోగ సంఘాలు ఐక్యంగా నిలబడి, తమ కోర్కెలను విజ్ఞాపన పత్రాలలో పేర్కొని, వేతన సంఘాలకు సమర్పించి, చర్చించేవి. వేతనసంఘాల నియామకం కోసం మరియు అవిచేసిన సిఫార్సుల అమలుకోసం ఎన్నో ఆందోళనలూ, ఉద్యమాలు, సమ్మెలు కూడా సాగించటం, వీటిని తీవ్ర అణచివేతలు – నిర్బంధాలు, అరెస్టులు, సస్పెన్షన్లు, ఉద్యోగ ఉద్వాసనలు, పోలీసు కాల్పుల్లో కొద్దిమంది మరణించటం వంటి దుర్మార్గ చర్యలను, పాలకులు సాగించిన అప్రజాస్వామిక చర్యలను ఉద్యోగసంఘాలు సంఘటితంగా ఉద్యమాల ద్వారా ఎదుర్కోవడం వల్లనే కేంద్ర వేతనసంఘాల నియామకం, జీతభత్యాల పెంపు, పెన్షన్ వంటి సదుపాయాలు సాధించుకోవడం జరిగిందని గత చరిత్ర పరిశీలిస్తే నేటితరాల ఉద్యోగులకు, కార్మికులకు స్పష్టమవుతుంది.

**7వ వేతన సంఘం – సిఫార్సులు :**

ఏడవ వేతనసంఘం సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి, అమలుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ వేతనసంఘం చేసిన సిఫార్సులు, వీటి తీరుతెన్నులు గత వేతన సంఘాల కంటే భిన్నమైనవిగానూ, ఉద్యోగ కార్మిక వ్యతిరేక వైఖరిని ప్రదర్శించేవిగాను, హాని కల్గించేవిగాను వున్నాయి. వాటిని గురించి ప్రస్తావించుకుందాం.

గత 25 సంవత్సరాలుగా (1991 నుండి) భారతదేశంలో పాలకులు నూతన ఆర్థిక విధానాలను అమలుచేస్తున్నారు. ఇవన్నీ, ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాలు! ఫలితంగా అన్నిరంగాలు ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ చెందుతున్నాయి. ఉద్యోగుల, కార్మికుల, రైతుల, శ్రామిక ప్రజల జీవన స్థితిగతులు మెరుగు పడలేదు; పైగా మరింత దిగజారుతున్నాయి. ఆర్థిక అసమానతలు బాగా పెరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో, నేడు అమలవుతున్న ఏడవ వేతన సంఘ సిఫార్సులు పై విధానాల పరిధిలో వున్నాయేగాని, వాటికి భిన్నంగా లేవని కొన్ని అంశాలను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. 2014 జనరల్ ఎన్నికల ముందు, యుపిఏ ప్రభుత్వం జస్టిస్ ఎ.కె. మాదూర్ నాయకత్వాన ఏడవ వేతనసంఘాన్ని నియమించింది. ఇది, వివిధ ఉద్యోగసంఘాల, కార్మిక సంఘాల నుండి వీటి డిమాండ్లకు సంబంధించి; అవి చేసిన ప్రతి ప్రతిపాదనలను విజ్ఞాపన పత్రాల ద్వారా స్వీకరించి చర్చించింది. ఎన్‌డిఏ 2014లో అధికారం చేపట్టిన తర్వాత వేతన సంఘం పరిశీలించాల్సిన అంశాలలో, షరతులలో కొన్ని మార్పులు సూచించింది. ముఖ్యంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు, పరిమితులు దృష్టిలోకి తీసుకోవాలని సూచించింది. కమిటీ, తన నివేదికను తయారుచేసి 19-11-2015న కేంద్ర ఆర్థికమంత్రికి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించి, తగిన మార్పులు చేర్పులు సూచించమని కేంద్ర కేబినెట్ కార్యదర్శి ఆధ్వర్యంలో ఎంపవర్ కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ చేసిన సూచనలేమిటో వెల్లడికాలేదు. కాని వేతన సంఘం నివేదికను మాత్రం వెంటనే కేంద్రం ప్రకటించింది. దీనిమీద దేశవ్యాప్తంగా కొంత చర్చ జరిగింది. ఖజానా మీద ఆర్థికభారం పడుతుందని కొందరు అభిప్రాయపడితే, మార్కెట్లు పుంజుకుంటాయని వ్యాపారవర్గాలు, కంపెనీలు హర్షం ప్రకటించాయి. కాని ఉద్యోగ కార్మికసంఘాలు, తమ తీవ్ర వ్యతిరేకతను, అసంతృప్తిని ప్రకటించాయి. ఆందోళనలు సాగించాలని పిలుపిచ్చాయి. అంతేగాక జాతీయ సంయుక్త కార్యాచరణ సమితి (ఎన్‌జెఏసి)ని ఏర్పాటుచేసి, 11-7-2016 నుండి దేశవ్యాప్తంగా సమ్మెచేస్తామని ప్రకటించాయి. ఎన్‌జెఏసి కేంద్ర ప్రభుత్వానికి 9-6-2016న సమ్మె నోటీసు ఇచ్చింది. దీనితో కేంద్ర ప్రభుత్వంలో కొంత కదలిక వచ్చింది. ఆ వేతన సంఘ నివేదికలో యన్‌జెఏసి తీవ్రంగా వ్యతిరేకించిన కొన్ని సిఫార్సులను చూద్దాం. అవి – కనీసవేతనం రూ. 18 వేల నుండి రూ. 26 వేలకు పెంపు. దీనిని జాతీయ సంప్రదింపుల యంత్రాంగం (యన్‌జెసిఎం) వేతన సంఘానికి ప్రతిపాదించింది. 2014 సంవత్సరంలో నిత్యావసర వస్తువుల ధరలను పరిగణించాలని మరియు ఇతర అవసరాలను దృష్టిలోకి తీసుకోవాలని, ఆ మేరకు కనీసవేతనం రూ. 26 వేలుగా వుండాలని కోరింది.

అంతేగాక 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (1957) నిర్ధారించిన జీవన ప్రమాణాలను కనీస వేతనానికి ప్రాతిపదికగా తీసుకోవాలని యన్‌జెసిఎం విజ్ఞప్తి చేసింది. దీనిని వేతనసంఘం పెడచెవినబెట్టి, కనీస వేతనం రూ. 18 వేలకు పరిమితి చేసింది. ఈవిధంగా వ్యవహరించింది ఏడవ వేతన సంఘమే కాదు. రెండవ వేతనసంఘం (1959), మూడవ వేతన సంఘం (1973), నాల్గవ వేతన సంఘం (1987), ఐదవ వేతన సంఘం (1997), ఆరవ వేతన సంఘం (2006) – ఏదీ నివేదిక సిఫార్సులను పరిగణలోకి తీసుకోలేదు.

వేతన సంఘం మొత్తం ఉద్యోగుల వేతనాల పెంపు 14.27 శాతంగా సూచించింది. ఫిట్‌మెంట్ 2.57 శాతంగా సిఫార్సు

చేసింది. ఇది గత వేతన సంఘాలు సూచించిన దానికన్నా తక్కువే. అమల్లో వున్న 53 రకాల అలవెన్సులనూ రద్దుచేయాలని, మిగతా అలవెన్సులను హేతుబద్ధీకరించాలని, ఇంటి అద్దె అలవెన్సును 30, 20, 10 శాతంగా పొందుతున్న దానిని యథాతథంగానైనా కొనసాగించక కొత్తవేతనాలలో 24, 16, 8 శాతానికి తగ్గించాలని వేతన సంఘం సూచించింది. వడ్డీ లేని రుణాలను రద్దుచేయాలన్నది.

1-1-2016 నుండి అమలుకు వస్తున్న నూతన వేతన స్కేళ్ళల్లో వార్షిక ఇంక్రిమెంట్లు మరియు పదోన్నతులు పొందాలంటే, వీటికి కొన్ని షరతులు విధించింది. ఉద్యోగుల పనితీరు సరిగా లేకపోతే, అటువంటి ఉద్యోగుల వార్షిక ఇంక్రిమెంట్ నిలుపుదల చేస్తారు. పనితీరు 'బహుబాగు'గా వుంటేనే పదోన్నతి వుంటుంది. ఇది, సర్వీస్‌ను బట్టి యిచ్చే తదుపరి గ్రేడ్ స్కేలుకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నది. అతి సంకుచితమైన, అవినీతిమయమైన నేటి సామాజిక వ్యవస్థలో మౌలిక మార్పులు (ప్రజాతంత్ర స్వభావం కల్గినవి) తీసుకురాకుండా పై షరతులతో కూడిన పద్ధతులను ప్రవేశపెట్టడం, అవాంఛనీయమైన పరిస్థితులకు, నిరంకుశాధికారుల పెత్తందారీతనానికి దారితీస్తాయి.

1-1-2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిన ఉద్యోగులకు, వారు పొందుతున్న వేతనాల నుండి 10 శాతం చొప్పున మినహాయించి, దీనికి ప్రభుత్వ శాఖలు కూడా అంతే మొత్తాన్ని కలిపి పెన్షన్‌ఫండ్‌కు జమచేస్తాయి. దీని నుండి కొంతమొత్తాన్ని స్టాక్ మార్కెట్‌లో మదుపుచేస్తారు. మిగతాది పదవీవిరమణ తర్వాత ఉద్యోగి పెన్షన్ సదుపాయాల క్రింద ఇస్తారు. దీనినే 'నూతన పెన్షన్ స్కీమ్' (NPS)గా పిలువబడుతున్నది. ఈ కొత్త పథకాన్ని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్రాలు (ఒకటి రెండు మినహా) అన్నీ అమలుచేస్తున్నాయి. దీనిని రద్దుచేసి, పాత పెన్షన్ స్కీం విధానాన్నే కొనసాగించాలని యన్‌జెసిఎం వేతన సంఘాన్ని కోరింది. దీనినీ వేతనసంఘం పరిగణించలేదు. పైన పేర్కొన్న వేతన సంఘ సిఫార్సులు ఉద్యోగులను నిరాశపరిచాయి. ఎన్‌జెసిఎం డిమాండ్లను ప్రభుత్వం కూడా పరిశీలించక, 29.6.2016న కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిపి వేతన సంఘ నివేదికకు ఆమోదముద్ర వేసింది. సమ్మెను విరమించుకోవాలని, వేతనాలు బాగా పెంచామని విస్తృత ప్రచారం సాగించింది. సమ్మె కార్యక్రమాన్ని ప్రక్కమార్గం పట్టించాలని మీడియా ద్వారా ప్రయత్నించింది.

యన్‌జెఎసి 30-6-2016న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని సాగించింది. ఉద్యోగులకు, కార్మికులకు 7వ వేతన సంఘం ఒరగబెట్టిందేమీ లేదని, పాలకుల వైఖరిని బహిర్గతం చేసి కనీస వేతనం పెంపు, ఫిట్‌మెంట్ సూత్రాన్ని పరిష్కరించేవరకు సమ్మె ప్రతిపాదన విరమించుకోవడం సాధ్యంకాదని ప్రకటించింది. దీనితో కేంద్ర ప్రభుత్వం జూన్ 30 రాత్రి యన్‌జెసిఎం నాయకులతో సమావేశమై దాని డిమాండ్స్‌పైన చర్చించింది. ఈ చర్చలలో హోంమంత్రి, ఆర్థికమంత్రి, రైల్వేమంత్రి పాల్గొన్నారు. కనీసవేతనం, ఫిట్‌మెంట్ సూత్రాన్ని సమీక్షిస్తామని దీనికోసం ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని హామీ యిచ్చారు. ఈ కమిటీ రిపోర్టు యివ్వడానికి నాలుగు నెలలు గడువు యిచ్చారు.

ఇంటి అద్దె అలవెన్స్, రద్దుచేసిన 53 అలవెన్సులను, ఇతర అలవెన్సులను సమీక్షించడానికి ఆర్థిక కార్యదర్శి అధ్యక్షతన మరో కమిటీని ఏర్పాటుచేస్తామని, నూతన పెన్షన్ పథకాన్ని కూడా పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కానీ కమిటీ నియామకం జరగలేదు. విధించిన నాలుగు నెలల గడువు అక్టోబరుతో ముగుస్తుంది. ప్రభుత్వ హామీలు ఎంతవరకు నెరవేర్చుతుందో ప్రశ్నార్థకమే! అదే సమయంలో, యీ ప్రభుత్వం యిచ్చిన హామీలను నెరవేర్చడంలో సాచివేత వైఖరిని అవలంబిస్తే, యన్‌జెఎసి సమరశీలమైన ఐక్య ఉద్యమాలను సాగించి, బేరమాడేశక్తిని పెంపొందించుకోవడం ద్వారా సాధించడం సాధ్యంకావచ్చును.

ఈ సందర్భంగా మరొక అంశాన్ని ప్రస్తావించు కోవాలి. అదేమిటంటే ఇటు ప్రభుత్వ - అటు ప్రయివేట్ రంగాలు ఔట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్టు విధానాలను పెద్దఎత్తున అమలుచేస్తూ, వేతన స్కేళ్ళ విధానానికి తిలోదకాలు ఇవ్వడం, పనిగంటలు - పనిరోజులను పెంచుతూ అదనపు పనిభారాన్ని పెంచటం జరుగుతోంది. పర్యవసానంగా పొందుతున్న వివిధ సౌలభ్యాలు కోల్పోవడం; వారికున్న చట్టబద్ధమైన రక్షణలు, హక్కులు చట్టసవరణల ద్వారా హరించివేస్తున్నారు. మరో రూపంలో వెట్టిచాకిరీని పెంచుతున్నారు. ఈ దురవస్థలకు కారణమవుతున్న ఉద్యోగ - కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలపట్ల ఉద్యోగులకు - కార్మికులకు అవగాహన - చైతన్యాన్ని పెంపొందించడాన్ని వారి సంఘాలు ఒక కర్తవ్యంగా స్వీకరించాలి. క్షీణిస్తున్న జీవనస్థితిగతుల, కోల్పోతున్న ఉపాధి సమస్యల సవాళ్ళను ఎదుర్కోగల శక్తివంతులుగా మలుచుకోవాల్సి వుంది. దీనికోసం, తమ వృత్తి నిర్వహణలో, వారి యాజమాన్యాల పాలన (ఎడ్మినిస్ట్రేషన్)లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమ నిర్మాణం ద్వారానే ఆందోళనలు, ఉద్యమాలు సాగించందే పరిష్కారం కావడంలేదు.

అలానే ఉమ్మడి సమస్యలు - వేతన - అలవెన్స్‌లు పెంపు, పదవీవిరమణ సౌలభ్యాలు సాధన, హక్కుల రక్షణకోసం ఆందోళనోద్యమాలు; సమ్మె పోరాట కార్యక్రమాలు సాగించకుండా సాధించుకోవడం సాధ్యంకావడంలేదని గత దశాబ్దాల చరిత్ర తెలియ చేస్తోంది. అంతేగాక ఆవిధంగా సాధించుకున్న వాటిని, కొన్ని రద్దు, మరికొన్ని కుదించడానికి పాలకులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందువలన ఉద్యోగ - కార్మిక సంఘాలకు ప్రత్యక్ష కార్యాచరణే శరణ్యం! వీటిని విజయవంతంగా సాగించాలంటే ప్రజా సహకారం, ప్రజా సంఘాల, ప్రగతిశీల కార్మిక కర్షక సంఘాల మద్దతునూ పొందటం అవసరం!!

ooooo